సాక్షి
గుంటూరు

బుధవారం, 1, అక్టోబర్, 2025



ఆంజనేయ విగ్రహ పునఃప్రతిష్ట

వెల్దుర్తి: వజ్రాలపాడు సమీపంలోని చెరువులో వేంచేసి ఉన్న వీరాంజనేయ స్వామి వారి విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమం మంగళవారం వైభవంగా నిర్వహించారు.



ఇంద్రకీలాద్రిపై వేదసభ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం వేదసభ నిర్వహించారు. 450 మంది వేద పండితులు పాల్గొన్నారు.

9వ రోజు ఆదాయం రూ.40.12 లక్షలు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో 9వ రోజైన మంగళవారం దుర్గ గుడికి రూ.40.12 లక్షల మేర ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. భక్తులకు 2.29 లక్షల లడ్డూలను విక్రయించామని వివరించారు.

న్యూస్‌రీల్

నేడు పింఛన్లు పంపిణీ

నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 2,56,904 మంది పింఛనుదారులకు రూ. 111.34 కోట్లు పంపిణీ జరుగుతుందన్నారు. ఒకటో తేదీన తీసుకోని వారికి 2వ తేదీన సెలవు దినం కావడంతో 3న పంపిణీ చేస్తారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

షటిల్ టోర్నమెంట్‌లో విజేతగా శ్రీసూపర్ కింగ్స్



గుంటూరు మెడికల్: గుంటూరులో వైద్యుల షటిల్ టోర్నమెంట్ పోటీలు మంగళవారం విజయవంతంగా జరిగాయి. గుంటూరు అమరావతి రోడ్డులో జరిగిన షటిల్ టోర్నమెంట్‌లో వంద మందికి పైగా వైద్యులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతగా శ్రీసూపర్‌కింగ్స్ నిలిచారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ కె.కళ్యాణ్ చక్రవర్తి కెప్టెన్‌గా ఆడిన షటిల్ టోర్నమెంట్‌లో కార్డియాలజిస్ట్ డాక్టర్ బి.వి.నారాయణరెడ్డి, స్పైన్ సర్జన్ డాక్టర్ డి.శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్‌లు టీమ్‌గా ఆడి కప్పు గెలుచుకున్నారు. ఫైనల్‌లో సందీప్ స్ట్రయికర్స్ టీమ్‌ను 3.1 తేడాతో ఓడించి శ్రీసూపర్ కింగ్స్ విజేతగా నిలిచింది. శ్రీ సూపర్ కింగ్స్ టీమ్ సభ్యులకు పలువురు వైద్యులు అభినందనలు తెలిపారు.

డాక్టర్ ధాత్రికుమారి సాహిత్య సేవలు అభినందనీయం




గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు అధ్యాపకురాలిగా, పరిశోధకురాలిగా వివిధ ప్రక్రియల్లో సాహిత్య సృష్టి చేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్న డాక్టర్ ధాత్రికుమారి జాషువా సాహిత్య పురస్కారానికి అర్హురాలని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విశ్వనరుడు జాషువా సేవా సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో విశ్వకవి గుర్రం జాషువా 130 వ జయంతి ముగింపు సభలో భాగంగా మంగళవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో డాక్టర్ ధాత్రికుమారికి జాషువా సాహితీ పురస్కారం అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాషువా సాహిత్యం అజరామరం అన్నారు. కుల దురహంకారంపై, మహిళా అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసిన జాతీయ కవి అని కొనియాడారు. సభకు సంస్థ అధ్యక్షుడు ముట్లూరి వెంకయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో టి.మహతి బాలాజీ, ఆర్. నరసింహారావు, ఎ. కిరణ్, ప్రభుదాసు కేరామారావు, ఐ.నరసింహారావు, కె. విల్సన్ రావు తదితరులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో మత్స్యకారుల కాలనీ

దాచేపల్లి: మండలంలోని రామాపురం మత్స్యకారుల కాలనీ రెండు రోజులుగా జలదిగ్బంధంలోనే ఉంది. మంగళవారం కూడా కృష్ణానది వరద ఉధృతి తగ్గలేదు. దీంతో కొంత సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించగా మరికొన్నింటిని ఇళ్లపై భద్రపరిచారు. వరద ఉధృతి తగ్గకపోవటంతో పునరావాస కేంద్రంలోనే తలదాచుకుంటున్నారు. పత్తి, మిరప పంటలు నీట మునిగాయి. మండలంలోని పొందుగల వద్ద పొలాలు నీట మునిగాయి.

ఎన్‌జీజీఓ ఎన్నికలు వెంటనే పూర్తిచేయండి



నరసరావుపేట: ఏపీ ఎన్‌జీజీఓ పల్నాడు జిల్లా శాఖ ఎన్నికలు వెంటనే పూర్తి చేయాలని గుంటూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అడహాక్ కమిటీ సభ్యులకు సూచించారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో అడహాక్ కమిటీ ఛైర్మన్ రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యదర్శి ఎస్.శ్యాం సుందర శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని తాలూకా యూనిట్ల సభ్యత్వాలను వెంటనే పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, అడహాక్ కమిటీ సభ్యులు, తాలూకా యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



గుంటూరులోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో కనకదుర్గగా అమ్మవారు



కొరిటెపాడు సెంటర్‌లో కనకదుర్గమ్మగా అలంకారం



గుంటూరులోని శ్రీకాళికాదేవి ఆలయంలో కనకదుర్గ అలంకరణలో అమ్మవారు



మంగళగిరి నరసింహస్వామి ఆలయంలో శ్రీ ధైర్యలక్ష్మి అలంకారంలో అమ్మవారు



పెదకాకాని శివాలయంలో దుర్గాదేవి అలంకరణలో భ్రమరాంబ

కనికరించవమ్మా.. కనక దుర్గమ్మ

శ్రీదేవి శరన్నవరాత్రులు జిల్లా వ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం పలు ఆలయాల్లో అమ్మవారు కనకదుర్గగా, ధైర్యలక్ష్మిగా భక్తులను కటాక్షించారు. గుంటూరులోని శ్రీకన్యక పరమేశ్వరి ఆలయంలో, శ్రీకాళికాదేవి ఆలయంలో విశేష అలంకరణలో అమ్మవారు కనకదుర్గగా దర్శనమిచ్చారు. కొరిటెపాడు సెంటర్‌లోనూ కనకదుర్గాదేవిగా కొలువుదీరారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులను అనుగ్రహించారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చండీ, రుద్ర హోమాలు నిర్వహించారు. మంగళగిరిలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అమ్మవారు ధైర్యలక్ష్మిగా దర్శనమిచ్చారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు/పెదకాకాని/ మంగళగిరి

కుట్రల కూటమిపై నిరసన జ్వాల

పేదలకు విద్య, వైద్యాన్ని దూరం చేసేందుకు కుట్రలు పన్నుతున్న కూటమి ప్రభుత్వ వైఖరిపై నిరసన జ్వాలలు ఎగసిపడ్డాయి. పాలకుల నియంతృత్వ నిర్ణయాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, దళిత సంఘాలు నిప్పులు చెరిగాయి. ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తే పేదల పక్షాన ఎదురొడ్డి పోరాడేందుకు ఏ మాత్రం వెనుకాడబోమని హెచ్చరికలు జారీ చేశాయి. పెత్తందారులకు దోచిపెట్టేందుకు కుయుక్తులు పన్నుతున్న రాష్ట్ర ప్రభుత్వ మెడలు వంచుతామని, ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని నేతలు తేల్చిచెప్పారు.



గుంటూరులో ప్లకార్డులతో ర్యాలీగా వస్తున్న మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, సమన్వయకర్తలు అన్నాబత్తుని శివకుమార్, అంబటి మురళీకృష్ణ, దొంతిరెడ్డి వేమారెడ్డి, వనమా బాల వజ్రబాబు తదితరులు

- ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణపై వైఎస్సార్‌సీపీ తీవ్ర ఆగ్రహం
- దళిత సంఘాలతో కలసి గుంటూరు నగరంలో భారీ నిరసన
- కూటమి సర్కారు తీరుతో పేద, మధ్యతరగతి వారికి తీవ్రనష్టం
- ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకునేవరకు పోరాటం ఆగదు
- స్పష్టం చేసిన వైఎస్సార్‌సీపీ కీలక నేతలు, దళిత నాయకులు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ వద్దంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గెడ్డేటి సురేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం లాడ్జి సెంటర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ ఎంపీ, ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాల రెడ్డి, సమన్వయకర్తలు అన్నాబత్తుని శివకుమార్, అంబటి మురళీకృష్ణ, దొంతిరెడ్డి వేమారెడ్డి, వనమా బాల వజ్రబాబు, పార్టీ నేతలు, కార్యకర్తలు, పలు దళిత సంఘాల నేతలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం పాదయాత్రగా వెళ్లి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తర్వాత వారు మాట్లాడుతూ కూటమి పాలకుల తీరుపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, నేతలు బత్తుల దేవానంద్, షేక్ గులాం రసూల్, మండేపూడి పురుషోత్తం, నందేటి రాజేష్, తాడిబోయిన వేణుగోపాల్, దానం వినోద్, పిల్లి మేరీ, సత్తెనపల్లి రమణి, సీహెచ్ వినోద్, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు, నగర, జిల్లా, రాష్ట్ర కమిటీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

దళిత వ్యతిరేకి చంద్రబాబు

ఈ సందర్భంగా టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం మానవ హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. దళిత వ్యతిరేకి చంద్రబాబు అన్నారు. అందుకే ఆ వర్గాలకు వైద్యవిద్య అందకుండా ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారని ధ్వజమెత్తారు. పేదల కోసం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.8 వేల కోట్లతో చేపట్టిన మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయటం సిగ్గుచేటన్నారు. పేదలకు విద్య, వైద్యం దూరం చేసే దురాలోచన చేస్తే ఎంతటి పోరాటానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

అంబేడ్కర్ ఆశయానికి తూట్లు

మాజీ ఎంపీ, ఎన్టీఆర్ జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాల రెడ్డి మాట్లాడుతూ పేదవాడికి ముందుగా అందాల్సింది కూడు.. గూడు.. వస్త్రాలని మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పారన్నారు. ఆయన ఆశయానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. పేదవారిని ఇబ్బందులకు గురి చేయాలని చూస్తే వైఎస్సార్ సీపీ పోరాటాలకు వెనుకాడబోదని స్పష్టం చేశారు. చంద్రబాబు దుష్ట పాలనను పవన్ కళ్యాణ్ ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆయన కూడా విలన్‌గా రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతారన్నారు.

భావితరాలకు నష్టం

పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భావితరాల భవిష్యత్తును ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేస్తోందని విమర్శించారు. రూ.8 వేల కోట్లతో కళాశాలలు, ఆసుపత్రులు నిర్మాణం చేపట్టి ఐదు కళాశాలలు పూర్తి చేసి విద్యార్థులకు వైఎస్ జగన్ బాసటగా నిలిచారన్నారు. కానీ, చంద్రబాబు తన వ్యాపారం కోసం కళాశాలలను అమ్మేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటం తప్పదని హెచ్చరించారు.

పోరాటం కొనసాగిస్తాం

ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గెడ్డేటి సురేంద్ర మాట్లాడుతూ చంద్రబాబు పీపీపీ విధానం అని చెబుతున్నారని గుర్తుచేశారు. పేద ప్రజలను పీక్కుతినటమే పీపీపీ విధానమా అని ప్రశ్నించారు. ఎస్ఆర్ఎం, వీఐటీ, అమృత వంటి విద్యా సంస్థలకు ప్రభుత్వ భూములను ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. దళితులకు మేలు చేకూర్చేందుకు వైఎస్సార్ సీపీ అధినేత జగనన్న తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు. దళితుల కోసం ఉద్యమాలకు వెనుకాడబోమని పేర్కొన్నారు.

అవయవ దానంతో పలువురికి నూతన జీవితం



నాగేంద్రకుమార్ (ఫైల్)



ప్రదీప్‌కుమార్ (ఫైల్)

గుంటూరు మెడికల్: బ్రెయిన్ డెడ్ అయి లోకాన్ని విడిచిపోతున్న వారి అవయవాల దానంతో పలువురికి నూతన జీవితాన్ని ప్రసాదించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని జీవన్ దాన్ సంస్థ మంగళవారం బ్రెయిన్‌డెడ్ అయిన ఇద్దరి అవయవాలను అవసరమైన వారికి పంపింది. మంగళగిరిలోని ఎయిమ్స్‌లో ఇండ్లమూరి నాగేంద్ర కుమార్ (21) బ్రెయిన్ డెడ్ అయ్యారు. నాగేంద్రకుమార్ లివర్‌ను గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌కు మంగళవారం ప్రత్యేక గ్రీన్ చానల్ ద్వారా పోలీసుల సహకారంతో వైద్యులు తరలించారు. అలాగే, గన్నవరం పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయిన ముప్పా ప్రదీప్‌కుమార్ (46)కు చెందిన రెండు కిడ్నీలను కూడా ఇదే హాస్పిటల్స్‌కు పంపారు. ఈ సందర్భంగా హాస్పిటల్స్‌కు చెందిన డాక్టర్ కార్తీక్ చౌదరి మాట్లాడుతూ.. పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా బ్రెయిన్ డెడ్ అయిన తమ వారి అవయవాలను కుటుంబసభ్యులు దానం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేల మంది వివిధ అనారోగ్యాలతో బాధపడుతూ అవయవాల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. డాక్టర్ అనుష మాట్లాడుతూ ఒకరికి అవయవదానం చేసి జీవితాన్ని ప్రసాదించడం వల్ల వారి కుటుంబం మొత్తం ఆనందంగా ఉంటుందన్నారు.



అవయవాలను రమేష్ ఆసుపత్రికి తీసుకొస్తున్న వైద్యులు

7న చలో విజయవాడకు ఫ్యాప్టో పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు


గుంటూరు ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) పిలుపు మేరకు ఈ నెల 7న విజయవాడలోని ధర్నా చౌక్‌లో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు నక్కా వెంకటేశ్వర్లు, గుత్తా శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ కె.నరసింహారావు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు ధర్నా సన్నాహక సమావేశాన్ని మంగళవారం నగరంపాలెంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు.

- గుత్తా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించడంతో పాటు, 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి మంజూరు, పాత పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని తెలిపారు.
- నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగులకు స్నేహపూరిత ప్రభుత్వమని చెబుతూనే రాష్ట్రంలోని 12 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించిన, చర్చించిన పరిస్థితులు లేవన్నారు.
- కె. నరసింహారావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు దాదాపు రూ.30 వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరినప్పటికీ ఇంతవరకు స్పందన లేదన్నారు.
- సెక్రటరీ జనరల్ కె.వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయ సంఘాలతో విద్యా రంగ, ఆర్థిక సమస్యలపై చర్చించి పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు, ఫ్యాప్టో జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎండీ ఖాలీద్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.కళాధర్, జి.వెలాంగిణీ రాజు, జిల్లా నాయకులు దిబ్బయ్య, ఎం.కోటిరెడ్డి, షేక్ బాజి బాలాజీ, ప్రసాద్, విజయానంద్ పాల్గొన్నారు.

దివ్యం.. దుర్గమ్మ దర్శనం

- వైభవంగా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు
- వేదపఠనంతో మారుమోగిన ఇంద్రకీలాద్రి
- అమ్మ దర్శనానికి తరలివస్తున్న భవానీలు
- నేడు మహిషాసురమర్దినిగా అలంకారం





విద్యుద్దీప కాంతులతో అలంకరించిన ఇంద్రకీలాద్రిపై భక్తుల సందడి, (ఇన్‌సెట్) దుర్గాదేవిగా అమ్మవారు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ మంగళవారం శ్రీదుర్గాదేవి అలంకారంలో భక్తులను కరుణించారు. లోకకంటకుడైన దుర్గమాసురుడనే రాక్షసుడిని వధించి ఇంద్రకీలాద్రిపై దుర్గాదేవిగా కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము మూడు గంటలకు అమ్మవారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత క్యూలైన్‌లోకి చేరిన భక్తులకు తెల్లవారుజామునే దర్శనం పూర్తయింది. మధ్యాహ్నం నుంచి వర్షం పడటంతో క్యూలైన్‌లో ఉన్న భక్తులు, అమ్మవారి దర్శనం పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమైన వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వీఐపీలు, సిఫార్సులతో దర్శనానికి వచ్చే వారి సంఖ్య అంతంత మాత్రంగానే కనిపించింది. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత వీఐపీల తాకిడి పెరగడంతో ఆలయ ప్రాంగణంలో కాస్త గందరగోళ పరిస్థితులు కనిపించాయి. కనకదుర్గమ్మ బుధవారం శ్రీమహిషాసురమర్దినీదేవిగా దర్శనమిస్తారు.

ముగింపు దశకు ఉత్సవాలు

గత నెల 22వ తేదీన ప్రారంభమైన దసరా ఉత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. గురువారం శ్రీరాజరాజేశ్వరి అలంకారం, ఉదయం పది గంటలకు యాగశాలలో మహా పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో అమ్మవారి దీక్ష స్వీకరించిన భవానీల రాక ప్రారంభమైంది. దీంతో పోలీసులు, ఇటు రెవెన్యూ అధికారులు అప్రమత్తమై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భవానీమాలధారుల రాకతో ఆలయ పరిసరాలు అరుణ వర్ణాన్ని సంతరించుకున్నాయి.

దుర్గమ్మ సేవలో దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్ లాల్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ శీనానాయక్ సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. సినీ నటి హేమ అమ్మవారిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

3 నుంచి డీఎస్సీ-2025 ఉపాధ్యాయులకు శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో డీఎస్సీ-2025 ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులకు ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పాఠశాల విద్య ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి, డీఈవో సీవీ రేణుక మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, నరసరావుపేట. వినుకొండ, బాపట్లలో ఏర్పాటు చేసిన ఐదు శిక్షణ కేంద్రాల్లో ఆయా సబ్జెక్టులవారీగా రెసిడెన్షియల్ విధానంలో జరిగే ఈ కార్యక్రమానికి సంబంధిత ఉపాధ్యాయులు హాజరు కావాలని సూచించారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలతోపాటు జోన్-3 పరిధిలోని పీజీటీ, టీజీటీలుగా ఎంపికైన అభ్యర్థులు 3న ఆయా కేంద్రాల్లో ఉదయం 7 గంటలకు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. శిక్షణకు ఆలస్యంగా వచ్చినా, ముందుగానే వెళ్లిపోయినా గైర్హాజరుగా పరిగణిస్తామని తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి నూరుశాతం హాజరు ఉండాలని, అధునాతన ఆండ్రాయిడ్ ఫోన్‌తోపాటు అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను వెంట తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు తమ వ్యక్తిగత ఔషధాలతోపాటు వారం రోజులకు సరిపడా వస్త్రాలను కూడా తెచ్చుకోవాలి తెలిపారు. పాలు తాగే చంటిబిడ్డలు ఉన్న తల్లులు తమ వెంట సహాయకులుగా ఒకరిని తెచ్చుకునేందుకు అనుమతి ఉందని పేర్కొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలో కాంస్య పతకం




లక్ష్మీపురం: జార్ఖండ్‌లోని రాంచీలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగిన 64వ జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు రైల్వే డివిజన్ ఉద్యోగి కాంస్య పతాకాన్ని సాధించడం అభినందనీయం అని డివిజన్ పీఆర్‌ఓ వినయ్‌కాంత్ తెలిపారు. టీటీఐగా విధులు నిర్వహిస్తున్న రష్మిశెట్టి జావెలిన్ త్రోలో పతకం సాధించారన్నారు. రష్మిశెట్టిని డీఆర్‌ఎం సుధేష్టసేన్ అభినందించారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పొడిగింపు

నరసరావుపేట ఈస్ట్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష దరఖాస్తు గడువును అక్టోబర్ 15వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు డాక్టర్ కె.వి.శ్రీనివాసులురెడ్డి మంగళవారం తెలిపారు. అభ్యర్థులు ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.in లో తమ పేరు నమోదు చేసుకొని పరీక్ష రుసుమును 16వ తేదీలోగా చెల్లించి ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రశీదును 18వ తేదీలోగా సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందచేయాలని వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. వివరాలకు సమీపంలోని ఎంఈఓ, డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

వల విసరక.. పూట గడవక..

- దయనీయంగా మత్స్యకారుల జీవితాలు
- మూడు నెలలుగా కృష్ణానదిలో తరచూ వరద
- చేపల వేటకు వెళ్లలేని పరిస్థితిలో ఆర్థిక కష్టాలు
- ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలని వేడుకోలు



ప్రకాశం బ్యారేజ్ దిగువన ఉద్ధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది



సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద మత్స్యకారులు నిలిపివేసిన పడవలు

తాడేపల్లి రూరల్ ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణానదిలో చేపలు వేటాడే మత్స్యకారుల బతుకు దయనీయంగా ఉంది. గత రెండు నెలల నుంచి కృష్ణానదికి తరచూ వరద రావడంతో వల విసరలేని పరిస్థితి నెలకొంది. పొట్ట నింపుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యారేజ్ ఎగువ, దిగువ ప్రాంతాల్లో సుమారు 450 కుటుంబాలు చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. వీరే కాకుండా తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి నుంచి వలస వచ్చిన మరో 50 కుటుంబాలు కృష్ణానదిని నమ్ముకునే ఇలా బతుకుతున్నాయి. నదికి కొన్ని నెలలుగా వరద పోటెత్తుతూ ఇప్పుడు 6 లక్షల క్యూసెక్కుల వరకు చేరింది. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లాలంటే కృష్ణానది గేట్లు తప్పనిసరిగా మూసి ఉండాలి. లేని పక్షంలో పడవ నిలిచి వల వేడయానికి కుదరదు. నాలుగైదు నావల వారు కలిసి రాత్రి సమయంలో కృష్ణానదిలో అక్కడక్కడ రంగ వలలతో బుట్టలను ఏర్పాటు చేస్తారు. వరద రావడంతో అవి కొట్టుకుపోతున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు. గత మూడు నెలలుగా అందిన చోట అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద సొసైటీలు ఉన్నాయని, వాటి ద్వారా మత్స్యశాఖ అధికారులు ఆర్థిక సహాయాన్ని అందించాలని విన్నవించారు. రేషన్ సరకులు అందజేస్తే కడుపు నింపుకొంటామన్నారు. ప్రస్తుతం తమ కుటుంబాలు అర్ధాకలితో జీవించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

దోచుకుంటున్న వ్యాపారులు....

కృష్ణానదిలో చేపల వేట లేకపోవడంతో ప్రకాశం బ్యారేజ్ దిగువ ప్రాంతంలోని సీతానగరానికి వెళ్లే మార్గంలో చేపల వ్యాపారుల తమకు ఇష్టం వచ్చిన ధరలతో విక్రయిస్తున్నారు. కేజీ చెరువు చేపలను రూ.300 – రూ.500 వరకు అమ్ముతున్నారు. అవి కూడా కృష్ణానది చేపలు అంటూ అంటగడుతున్నారు. దిగువ ప్రాంతంలో చేపల వ్యాపారులు ఏర్పాటు చేసిన కాటాల్లో సైతం భారీ వ్యత్యాసం కనబడుతోంది. కేజీ చేప తీసుకుంటే 750 గ్రాములే ఉంటోందని పలువురు వాపోతున్నారు. తూనికలు, కొలతల అధికారులకు ఫిర్యాదు అందడంతో తనిఖీ చేయగా మోసం వెలుగుచూసింది. 15 కాటాలు సీజ్ చేసి, కేసులు నమోదు చేశారు. అయినా వ్యాపారులు తమ తీరు మార్చుకోవడం లేదని పలువురు కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు చేయాల్సి వచ్చింది



ప్రకాశం బ్యారేజ్ వద్ద మూడు నెలల నుంచి వరద వస్తూనే ఉంది. కొంచెం తగ్గిందని బుట్టలు ఏర్పాటు చేస్తే రాత్రికి రాత్రి వరద వచ్చి కొట్టుకుపోతున్నాయి. వలకు చేప చిక్కితేనే మా కడుపు నిండేది. మూడు నెలల నుంచి చేపల వేట లేకపోవడంతో చాలా మంది అధిక వడ్డీలకు డబ్బులు తీసుకుని ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– లంకె అప్పారావు

వరదతో కుదరని వేట



ప్రకాశం బ్యారేజ్ వద్ద గేట్లు ఎత్తి భారీగా వరద నీటిని కిందకి వదులుతున్నారు. మూడు నెలలుగా ఇదే పరిస్థితి ఉంది. దీంతో పడవ నడపడం కష్టంగా మారింది. మర పడవలు ఏదో ఒక విధంగా నడపవచ్చు. నాటు పడవలు నడపడం చాలా కష్టం. మర పడవలు కూడా వల వేయడానికి ఆపితే కొట్టుకుపోతాయి. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో చేపల వేట లేక ఇబ్బంది పడుతున్నాం.

– కొక్కిలిగడ్డ నాగార్జున

మరో పని తెలియదు



మాకు చేపల వేట తప్ప మరో పని తెలియదు. మా తాతలు, తండ్రుల దగ్గర నుంచి కృష్ణమ్మనే నమ్ముకుని జీవిస్తున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం ఎగువ ప్రాంతాలలో వర్షాలు కురియడంతో మూడు నెలల నుంచి బ్యారేజీ గేట్లు తెరిచే ఉన్నాయి. దీంతో చేపల వేటకు వెళ్లలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం.

– సైకం నాగబాబు

అలరించిన 'మోహినీ భస్మాసుర'



'మోహినీ భస్మాసుర'లో ఓ సన్నివేశం

తెనాలి: పురాణగాథ 'మోహినీ భస్మాసుర' పద్యనాటకంగా పండిత పామరులను అలరిస్తూనే ఉంది. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరుగుతున్న వీణా అవార్డ్స్-2025 జాతీయ పంచమ పద్యనాటక, సాంఘిక నాటక/నాటికల పోటీల్లో నాలుగో రోజైన మంగళవారం తొలి ప్రదర్శనగా ఈ నాటకం అలరించింది. విజయనగరానికి చెందిన అక్కినేని సాంస్కృతిక సమాజం ప్రదర్శించగా, వీక్షకుల కరతాళధ్వనులను అందుకుంది. వృకాసురుడనే రాక్షసుడు అయిదేళ్లపాటు భీకర తపస్సు చేయటంతో శివుడు ప్రత్యక్షమై, అడిగినదే తడవుగా ఎవరి తలపైనయినా చేయి పెట్టిన వెంటనే అతడు భస్మమయేలా, ఎవరివల్ల కూడా వృకాసురుడికి మరణం లేకుండా వరాలిస్తాడు. ఈ వరాలతో జరిగే కీడు తెలిసిన నారదుడు రెచ్చగొట్టటంతో వరాన్ని పరీక్షించుకునేందున వృకాసరుడు నేరుగా శివుడు దగ్గరకు వెళతాడు. శివుడు తప్పించుకుని శ్రీవిష్ణువును శరణు వేడతాడు. విష్ణువు నారదుడిని సంప్రదించి, మోహినీరూపం దాల్చి వృకాసురుని అంతమొదించటం ఇతివృత్తం. మద్దెల పంచనాదం రచనకు గవర సత్తిబాబు దర్శకత్వం వహించారు. వృకాసురుడుగా దాసరి తిరుపతినాయుడు, మోహినిగా కేవీ పద్మావతి, లక్ష్మీదేవిగా పి.నీలవేణి, నారదుడిగా గవర సత్తిబాబు పాత్రోచితంగా నటించారు.

ఆకట్టుకున్న ఇతివృత్తాలు

అనంతరం టీజీవీ కళాక్షేత్రం, కర్నూలు వారి 'జగదేక సుందరి సామా' పద్యనాటకాన్ని ప్రదర్శించారు. సామా అనే వేశ్య ఎందరినో బానిసలను చేసుకుంటుంది. వేలంలో కొనుగోలు చేసిన బానిస మాఘపై మనసు పడుతుంది. ఆమె దగ్గర బానిసలను విడిపించటానికి మాఘ ఆమెను ప్రేమిస్తున్నట్టు నటిస్తాడు. అతడి మాటలను నమ్మి బానిసలు విడుదల చేస్తుంది. ఆ వెంటనే సామా ఎదుటనే మాఘ విషం తీసుకుని మరణిస్తాడు. విరక్తి చెందిన సామా ఆత్మహత్యకు పూనుకోగా, పుణ్యకుడు అనే బౌద్ధగురువు హితబోధతో బౌద్ధసన్యాసినిగా మారుతుంది. సామాగా ప్రముఖ రంగస్థల, సినీనటి సురభి ప్రభావతి అద్భుతంగా నటించారు. ఇతర పాత్రల్లో జీవీ శ్రీనివాసరెడ్డి, కె.బాలవెంకటేశ్వర్లు, పి.రాజారత్నం నటించారు. పల్లేటి కులశేఖర్ రచనకు పద్యాలు/దర్శకత్వం పత్తి ఓబులయ్య. అనంతరం మానవత, యడ్లపాడు వారి 'అంతా మంచివారే...కానీ' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. రచన, దర్శకత్వం జరుగుల రామారావు. చివరగా అభ్యుదయ ఆర్ట్స్, విజయవాడ వారు 'క్రతువు' సాంఘిక నాటికను ప్రదర్శించారు. కేవీవీ సత్యనారాయణ రచనకు వేంపాటి రమేష్ దర్శకత్వం వహించారు. నాటకపోటీలను కళల కాణాచి, తెనాలి, ఆర్ఎస్ఆర్ గ్రీన్‌వే ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో కొనసాగిస్తున్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ఏల్చూరి



అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు



ఉపాధ్యక్షుడు వీరాంజనేయులు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) అధ్యక్షునిగా ఏల్చూరి వెంకటేశ్వర్లు గెలుపొందారు. గుంటూరు జిన్నాటవర్ కూడలిలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష పదవికి ఏల్చూరి వెంకటేశ్వర్లు, రంగా బాలకృష్ణలు పోటీపడ్డారు. సోమవార ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. అర్ధరాత్రి దాటే వరకు లెక్కింపు చేపట్టారు. అధ్యక్షుడిగా ఏల్చూరి వెంకటేశ్వర్లు 721 ఓట్లతో రెండోసారి గెలిచారు. రంగా బాలకృష్ణకు 65 ఓట్లు వచ్చాయి. ఏల్చూరి ప్యానెల్‌లో ముగ్గురు కార్యదర్శులు, ఉపాధ్యక్షులుగా టీఎల్‌వీ వీరాంజనేయులు, వి.వెంకటనాగిరెడ్డితోపాటు మరో నలుగురు గెలిచినట్లు చాంబర్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు మంగళవారం తెలిపారు. సుమారు 3,200 మంది వ్యాపారులకు చాంబర్‌లో సభ్యత్వం ఉండగా, ఓటేసేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. కేవలం 797 ఓట్లు మాత్రమే పోలయ్యాయి.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉద్ధృతం

వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యుల నిరసన

నరసరావుపేట టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు మంగళవారం పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సమస్యలు పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పీహెచ్‌సీ వైద్యులు ఓపీ సేవలు బహిష్కరించి నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ మమత ప్రియ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ సేవలు నిలిపివేశామని, అత్యవసర చికిత్సలకు సేవలందిస్తున్నామన్నారు. సుమారు 25 సంవత్సరాల నుంచి పదోన్నతులు లేక ఒకే హోదాలో సేవలందిస్తున్న వైద్యాధికారులకు న్యాయం చేయాలన్నారు. ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న వైద్యులకు 50 శాతం మూలవేతనం గిరిజన భత్యంగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి రూ.5 వేలు భత్యం ఇవ్వాలన్నారు. బుధవారం పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపడతామన్నారు. గురువారం విజయవాడ వైద్య శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టటం జరుగుతుందన్నారు. అప్పటికీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యులు రమ్య, జగన్ నరసింహారెడ్డి, రాధా కృష్ణణ్, ప్రదీప్, బాల అంకమ్మ పాల్గొన్నారు.

ఉత్కంఠగా కొనసాగుతున్న చెస్ పోటీలు



చెస్ ఆడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో లంకా రవి తదితరులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్కంఠగా కొనసాగుతున్నాయి. ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఈ పోటీలు జరుగుతున్నాయి పదో రోజైన మంగళవారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ హాజరయ్యారు. ఆట ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ చదరంగాన్ని బ్రెయిన్ గేమ్ అని కూడా అంటారన్నారు. నిజమైన విజయమంటే ప్రత్యర్థిని ఓడించడం మాత్రమే కాదని, మనలోని ఆలోచనా శక్తిని పెంచుకోవడమనిఅభిప్రాయపడ్డారు. ఏపీ నుంచి మొట్టమొదటి ఇంటర్నేషనల్ మాస్టర్ లంకా రవి మాట్లాడుతూ చదరంగం అనేది ఒక మేధో క్రీడ మాత్రమే కాకుండా, అనేక నైపుణ్యాలను నేర్పే వేదికన్నారు.

9వ రౌండ్ ఫలితాలు

తొమ్మిదో రౌండ్‌లో సంచలనాలు చోటుచేసుకున్నాయి. ముగ్గురు గ్రాండ్‌మాస్టర్లు, మాజీ జాతీయ చాంపియన్లు కూడా ఇంటర్నేషనల్ మాస్టర్ల చేతిలో ఓటమిపాలయ్యారు. పీఎస్‌పీబీకి చెందిన జీఎం సశికిరణ్ కృష్ణన్ గెలుపు అవకాశాన్ని కోల్పోయినా 7.5 పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నాడు. తమిళనాడుకు చెందిన జీఎం ఇనియన్ పి.ఎ., కేరళకు చెందిన ఐఎం గౌతమ్ కృష్ణ. హెచ్ కూడా అతనితో సమంగా లీడ్‌లో చేరారు. ఇంకా రెండు రౌండ్లు మిగిలి ఉండటంతో టైటిల్ పోరు ఉత్కంఠభరితంగా మారింది. పీఎస్‌పీబీకి చెందిన టాప్ జీఎంలు సూర్యశేఖర్ గంగూలీ, అభిజిత్ గుప్తా, ఎస్పీ సేతురామన్ వరుసగా గోవా ఐఎం రిత్విజ్ పరాబ్, కేరళ ఐఎం గౌతమ్ కృష్ణ, తమిళనాడు ఐఎం మనిష్ ఆంటో క్రిస్టియానో చేతిలో ఓడిపోయారు.

మద్యం మత్తులో కారుతో హల్‌చల్

- బొలెరోతో అడ్డొచ్చిన వారిని ఢీకొన్న వాహనదారుడు
- నలుగురికి తీవ్ర గాయాలు
- ద్విచక్ర వాహనాన్ని ఢీకొని అర కిలోమీటర్ వరకు లాక్కెళ్లిన వైనం
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు




ద్విచక్ర వాహనాన్ని ఈడ్చుకెళ్లడంతో నిప్పు రవ్వలు వెదజల్లుతున్న దృశ్యం



వాహనం నడిపిన సైదావలిని పోలీసులకు అప్పజెప్పిన స్థానికులు

పిడుగురాళ్ల: మద్యం మత్తులో బొలెరో వాహనాన్ని నడుపుతూ వాహనాలు, పాదచారులపైకి దూసుకుపోయిన ఘటన పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని అయ్యప్ప నగర్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. సేకరించిన వివరాలు ప్రకారం.. సైదావలి అనే యువకుడు పూటుగా మద్యం తాగి బొలెరో వాహనం నడుపుతూ దాచేపల్లి వస్తున్నాడు.. ఈక్రమంలో పిడుగురాళ్ల అయ్యప్పనగర్ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాల తో పాటు పాదచారులపైకి దూసుకుపోయాడు. మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన యువకుడు హైవేపై కొద్ది నిమిషాల పాటు హల్‌చల్ చేశాడు. ఈ ఘటనలో నలుగురికి గాయాలు కాగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. రోడ్డు పక్కన ద్విచక్ర వాహనం నిలిపి పక్కన మాట్లాడుతున్న వ్యక్తిని బొలెరోతో ఢీకొనడమే కాకుండా ఆ ద్విచక్ర వాహనాన్ని రోడ్డుపై ఈడ్చుకుంటూ అర కిలోమీటర్ దూరం వరకు వెళ్లాడు. వేగంగా వాహనం దూసుకుని పోవడంతో రోడ్డుపై నిప్పు రవ్వలు చెలరేగాయి. ఈ ఘటన చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గాయపడిన వారిలో నరసరావుపేటకు చెందిన ఓ వ్యక్తికి కాలు పూర్తిగా దెబ్బతింది. అతన్ని వెంటనే నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ తరలించినట్లు తెలిసింది. మిగిలిన వారిని పిడుగురాళ్ల పట్టణంలో ప్రైవేట్ హాస్పటల్‌లో చేర్పించారు. ఈక్రమంలో ఆ వాహనాన్ని అడ్డుకునేందుకు స్థానికులు విశ్వప్రయత్నం చేశారు. ఎట్టకేలకు పలువురు యువకుల సాయంతో బొలెరో వాహనాన్ని ఆపారు. అనంతరం మద్యం మత్తులో ఉన్న సైదావలికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గాయపడ్డ వారిని 108 ద్వారా పిడుగురాళ్ల ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనతో అద్దంకి -నార్కెట్‌పల్లి హైవేపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు సమాచారం తెలుసుకొని సంఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. వాహనం నడిపిన సైదావలిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివనాగరాజు తెలిపారు.





యడ్లపాడు మండలం కొత్తపాలెం రెవెన్యూ పరిధిలోని చౌదవరం గ్రామ శివారున ఉన్న క్వారీ కుంటలో మంగళవారం ఈతకు వెళ్లి గల్లంతైన బాలుడు షేక్ మాబు మృతదేహాన్ని వెలికితీసిన యడ్లపాడు పీఎస్ కానిస్టేబుల్ ప్రవీణ్, మిత్రబృందం. మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ టి.శివరామకృష్ణ – యడ్లపాడు

సాగర్‌బాబు ఘటనపై తగిన న్యాయం చేస్తాం



విద్యుత్ ఎస్ఈ విజయ్‌బాబుకు వినతి పత్రం అందజేస్తున్న సాగర్‌బాబు భార్య కెజియా

నరసరావుపేట రూరల్: విద్యుత్ షాక్‌కు గురై వికలాంగుడిగా మారిన సాగర్‌బాబు ఘటనలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. జొన్నలగడ్డలోని విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయం వద్ద సాగర్‌బాబు కుటుంబం గత రెండురోజులుగా నిరాహార దీక్షలు చేపట్టారు. మంగళవారం చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఎస్ఈ సందర్శించి, సాగర్‌బాబు భార్య కెజియాతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు ఎస్ఈని కలిసి చర్చించారు. సాగర్‌బాబు కుటుంబం గత 17 రోజులుగా రిలే నిరాహారదీక్షలు, రెండు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నట్టు తెలిపారు. వారి ఆరోగ్యం క్షీణిస్తుందని వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ ఘటనలో విద్యుత్ అధికారులకు ఎలాంటి సంబంధం లేదని గ్రామ పెద్దలు రాతపూర్వకంగా ఇచ్చారని ఎస్ఈ తెలపగా.. రెండున్నర సంవత్సరాల క్రితం ఘటన జరిగితే ఇప్పుడు నకిలీ లెటరు తీసుకువచ్చి చూపడం సరికాదని, ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. సాగర్‌బాబుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై శాఖాపరంగా విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్ఈ హామీ ఇచ్చారు. దీంతో సాగర్‌బాబు కుటుంబసభ్యులు రిలే నిరాహార దీక్షలను విరమించారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వర్లు, నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కార్యదర్శి జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ. వంద కోసం ఘర్షణ.. కత్తితో దాడి

తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిన యువకుడు



గాయపడిని షేక్ జానీబాషా

పిడుగురాళ్ల: వందరూపాయల కోసం ఇద్దరి వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణ కత్తితో దాడి చేసుకునేంతగా వెళ్లిన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం... పట్టణంలోని హైస్కూల్ కాంప్లెక్స్‌లోని వీరభద్ర చికెన్ షాప్‌లో జానీబాషా, రియాజ్ అనే ఇద్దరు పని చేస్తూ ఉంటారు. జానీబాషా రియాజ్‌కు రూ.100 ఇవ్వాల్సి ఉంది. ఈ విషయమై రియాజ్ అడగ్గా.. తనకు అంతకు ముందు రూ. 300 ఇవ్వాలని అవి ఇస్తే.. రూ.వంద ఇస్తానని జానీబాషా చెప్పటంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇద్దరు తోపులాట చేసుకుంటుండగా రియాజ్ వెంటనే పక్కనే మేక తోలు తీసే కత్తితో జానీబాషా పొట్టలో పొడిచాడు. జానీబాషా పొట్టలో నుంచి పేగులు బయటకు రావటంతో వెంటనే స్థానికులు ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. పట్టణ ఎస్ఐ శివనాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైకులు, దుకాణం దహనం

లక్ష్మీపురం: చిరు వ్యాపారం చేసుకునే దుకాణం, రెండు ద్విచక్రవాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్తంభాలగరువు ప్రాంతంలోని మధుసూధనరెడ్డి అనే వ్యక్తి ఇంటి బయట భాగంలో చిన్నపాటి కొట్టును ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. దుండగులు ఆ కొట్టుకు, అదే ప్రాంతంలో శివరామ్ అనే వ్యక్తికి సంబంధించిన రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పు అంటించారు. గమనించిన స్థానికుల మంటలు అదుపు చేశారు. అప్పటికే అవి దహనమయ్యాయి.




రన్నరప్ బోపన్న-యుజికి జోడీ

కెరీర్‌లో 27వ డబుల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్నకు నిరాశ ఎదురైంది. టోక్యోలో మంగళవారం ముగిసిన జపాన్ ఓపెన్ ఏటీపీ-500 టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-టకెరు యుజికి (జపాన్) జోడీ రన్నరప్‌గా నిలిచింది. హుగో నిస్ (మొనాకో)-ఎడువార్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటతో జరిగిన డబుల్స్ ఫైనల్లో బోపన్న-యుజికి ద్వయం 5-7, 5-7తో పోరాడి ఓడిపోయింది. 92 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-యుజికి ఆరు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌లను ఒకసారి బ్రేక్ చేశారు. రన్నరప్ బోపన్న-యుజికి జంటకు 72,940 డాలర్ల (రూ. 64 లక్షల 79 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 300 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. విజేతగా నిలిచిన హుగో నిస్-వాసెలిన్ ఖాతాలో 1,36,760 డాలర్ల (రూ. 1 కోటీ 21 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు చేరాయి. 45 ఏళ్ల బోపన్న తన డబుల్స్ కెరీర్‌లో 64 టోర్నీల్లో ఫైనల్‌కు చేరాడు. 26 టోర్నీల్లో విజేతగా, 38 టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచాడు.

ప్రదానం చేయలేదని.. ఎప్పటికీ పంపరా?

ఏసీసీ చీఫ్ నఖ్వీ ట్రోఫీ డ్రామాపై బీసీసీఐ ఆక్షేపణ ● ఏజీఎంలో తీవ్రస్థాయిలో అభ్యంతరం


రాజీవ్ శుక్లా


నఖ్వీ

దుబాయ్: ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) అధ్యక్షుడి వ్యవహార శైలిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మండిపడింది. మంగళవారం ఇక్కడ ఏసీసీ సర్వసభ్య సమావేశం (ఏజీఎం) జరిగింది. ఇందులో భారత బోర్డు తరఫున సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, మాజీ కోశాధికారి ఆశిష్ షెలార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అధ్యక్షుడు కూడా అయిన ఏసీసీ చీఫ్ మోసిన్ నఖ్వీ విపరీత ధోరణిపై బీసీసీఐ ప్రతినిధులిద్దరు ఆక్షేపించారు. నఖ్వీ పాక్ ప్రభుత్వంలో మంత్రి కూడా కావడంతో టీమిండియా అతని చేతుల మీదుగా జరగాల్సిన ట్రోఫీ ప్రదానోత్సవాన్ని సున్నితంగా తిరస్కరించింది. ఆదివారం రాత్రి తను ప్రదానం చేయలేదన్న అక్కసుతో నఖ్వీ తర్వాత కూడా విజేత భారత జట్టుకు పంపకుండా ఏసీసీ కార్యాలయంలోనే అట్టిపెట్టాడు. దీంతో 'కప్' లేకుండానే భారత క్రికెట్ జట్టు సభ్యులు స్వదేశానికి వచ్చారు. మంగళవారం జరిగిన ఏజీఎంలో నఖ్వీ కొనసాగిస్తున్న 'ట్రోఫీ డ్రామా'పై శుక్లా, షెలార్ తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఇది ఏసీసీ ట్రోఫీ. ఒక వ్యక్తికి సంబంధించినది కాదు. వ్యక్తిగతంగా ఎవరికి చెందదు. టోర్నీలో గెలిచిన విజేత జట్టుకే అప్పగించాలి' అని రాజీవ్ శుక్లా గట్టిగానే స్పష్టం చేశారని బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. ఏజీఎంలో ఇంత జరుగుతున్నా... భారత్ నుంచి తీవ్రస్థాయిలో అభ్యంతరం వెల్లువెత్తుతున్నా... ఏసీసీ అధ్యక్షుడు మోసిన్ నఖ్వీ మాత్రం ఇంకా తన మొండి పట్టు వీడటం లేదు. ట్రోఫీని ఇచ్చేందుకు సమావేశంలో అంగీకరించలేదని తెలిసింది. ట్రోఫీ గురించి ఏజీఎంలో చర్చించాల్సిన అవసరం లేదని, మరో సమావేశంలో మాట్లాడుకుందామని నఖ్వీ దాటవేశారు. ఏసీసీ ఎజెండాలోని వైస్ చైర్మన్ ఎన్నిక వరకే ఈ మీటింగ్‌ను పరిమితం చేయాలని చూశారు. అంతేకాదు. వెస్టిండీస్‌పై నేపాల్ సంచలన విజయం పట్ల నేపాల్ జట్టును అభినందించారు. నేపాల్ ఆసియా జట్టు కావొచ్చు. కానీ ఆ ద్వైపాక్షిక సిరీస్ ఏసీసీకి సంబంధించిన టోర్నీ కానేకాదు. అయినా నేపాల్‌ను ప్రశంసించిన నఖ్వీ... ఏసీసీ సొంత టోర్నీ అయిన ఆసియా కప్ గెలిచిన భారత్‌ను మాటమాత్రంగానైనా అభినందించకుండా తన కుటిల బుద్ధిని చాటుకున్నారు. మొత్తానికి ఆసియా కప్ ట్రోఫీ మాత్రం ఇంకా ఏసీసీ కార్యాలయంలోనే ఉంది.

దీప్తి ఆల్‌రౌండ్ షో

భారత మహిళల శుభారంభం
- శ్రీలంకపై 59 పరుగులతో జయభేరి
- రాణించిన హర్లీన్, అమన్‌జోత్
- ఈనెల 5న పాకిస్తాన్‌తో టీమిండియా పోరు
- మహిళల వన్డే ప్రపంచకప్

గువాహటి: సొంతగడ్డపై అట్టహాసంగా ఆరంభమైన వన్డే ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. బ్యాటింగ్‌లో అర్ధసెంచరీ సాధించిన దీప్తి శర్మ బౌలింగ్‌లో కీలక వికెట్లతో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచింది. దీంతో మంగళవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 59 పరుగుల తేడాతో శ్రీలంకపై ఘనవిజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్... వర్షం వల్ల కుదించిన 47 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీప్తి శర్మ (53 బంతుల్లో 53; 3 ఫోర్లు), అమన్‌జోత్ కౌర్ (56 బంతుల్లో 57; 5 ఫోర్లు, 1 సిక్స్), రాణించారు. లంక బౌలర్లలో ఇనొక రణవీర 4 వికెట్లు, ప్రబోధని 2 వికెట్లు తీశారు. అనంతరం దిగిన శ్రీలంక 45.4 ఓవర్లలో 211 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ చమరి ఆటపట్టు (47 బంతుల్లో 43; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుగ్గా ఆడింది. దీప్తి (3/54) సహా భారత బౌలర్లు స్నేహ్ రాణా (2/32), ఆంధ్రప్రదేశ్ అమ్మాయి శ్రీచరణి (2/37), క్రాంతి (1/41), అమన్‌జోత్ (1/37), ప్రతిక (1/6) సమష్టిగా ప్రత్యర్థి బ్యాటర్ల భరతం పట్టారు.



అమన్‌జోత్‌తో నడిపించి... బౌలింగ్‌తో గెలిపించి...

భారత వెటరన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షోకు శ్రీలంక కుదేలైంది. ప్రతీక (37; 3 ఫోర్లు, 1 సిక్స్), హర్లీన్ డియోల్ (64 బంతుల్లో 48; 6 ఫోర్లు) మెరుగ్గా ఆడినప్పటికీ మరోవైపు కీలక స్టార్లు స్మృతి మంధాన (8), హర్మన్‌ప్రీత్ (21), జెమీమా (0), రిచా ఘోష్ (2) విఫలమవడంతో 124/6 స్కోరు వద్ద భారత్ పనైపోయిందనిపించింది. ఈ దశలో దీప్తి, అమన్‌జోత్‌తో కలిసి భారత్‌ను నడిపించింది. లంక అమ్మాయిల చెత్త ఫీల్డింగ్‌తో అమన్‌జోత్ మూడుసార్లు 18, 37, 50 పరుగుల వ్యక్తిగత స్కోర్ల వద్ద అవుటయ్యే ప్రమాదం నుంచి బయటపడింది. ఇద్దరు అర్ధసెంచరీ పూర్తి చేసుకొని జట్టును ఒడ్డుకు చేర్చారు. ఏడో వికెట్‌కు 99 బంతుల్లో 103 పరుగులు జోడించాక ముందుగా అమన్‌జోత్, అనంతరం దీప్తి అవుటయ్యారు. ఆఖర్లో స్నేహ్ రాణా (15 బంతుల్లో 28 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించింది. తర్వాత కష్టమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన శ్రీలంక వరుస విరామాల్లో వికెట్లను కోల్పోయి ఓటమిని ఆహ్వానించింది. ఓపెనర్, కెప్టెన్ చమరి ఆటపట్టు, వన్‌డౌన్ బ్యాటర్ హర్షిత (29; 3 ఫోర్లు), మిడిలార్డర్‌లో నీలాక్షిక సిల్వా (29 బంతుల్లో 35; 4 ఫోర్లు; 1 సిక్స్) మెరుగ్గా ఆడారంతే! మిగతా బ్యాటర్లను భారత బౌలింగ్ దళం క్రీజులో నిలువనీయలేదు.

ప్రపంచకప్‌లో నేడు
ఆస్ట్రేలియా X న్యూజిలాండ్
వేదిక: ఇండోర్
మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

భారత మహిళల ఇన్నింగ్స్: ప్రతిక రావల్ (సి) విష్మి (బి) ఇనొక 37; స్మృతి మంధాన (సి) విష్మి (బి) ప్రబోధని 8; హర్లీన్ డియోల్ (సి) దిల్హారి (బి) ఇనొక 48; హర్మన్‌ప్రీత్ కౌర్ (సి) సంజీవని (బి) ఇనొక 21; జెమీమా రోడ్రిగ్స్ (బి) ఇనొక 0; దీప్తి శర్మ (సి) సుగంధిక (బి) అచిని 53; రిచా ఘోష్ (సి) ప్రబోధని (బి) చమరి 2; అమన్‌జోత్ (సి) విష్మి (బి) ప్రబోధని 57; స్నేహ్ రాణా (నాటౌట్) 28; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (47 ఓవర్లలో 8 వికెట్లకు) 269. వికెట్ల పతనం: 1-14, 2-81, 3-120, 4-120, 5-121, 6-124, 7-227, 8-269.

బౌలింగ్: అచిని కులసూర్య 8-0-42-1, ఉదేషిక ప్రబోధని 10-1-55-2, సుగంధిక 9-0-46-0, కవిశా దిల్హారి 8-0-51-0, ఇనొక రణవీర 9-0-46-4, చమరి 3-0-24-1.

శ్రీలంక మహిళల ఇన్నింగ్స్: హాసిని (బి) క్రాంతి గౌడ్ 14; చమరి (బి) దీప్తి శర్మ 43; హర్షిత (ఎల్బీడబ్ల్యూ) (బి) శ్రీచరణి 29; విష్మి గుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) అమన్‌జోత్ 11; కవిశా (సి) రిచా ఘోష్ (బి) దీప్తి 15; నీలాక్షిక (బి) స్నేహ్ రాణా 35; అనుష్క (సి) హర్మన్‌ప్రీత్ (బి) దీప్తి 6; సుగంధిక (బి) స్నేహ్ రాణా 10; అచిని (సి) స్మృతి (బి) శ్రీచరణి 17; ప్రబోధని (నాటౌట్) 14; ఇనొక రణవీర (ఎల్బీడబ్ల్యూ) (బి) ప్రతిక రావల్ 3; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (45.4 ఓవర్లలో ఆలౌట్) 211.** వికెట్ల పతనం: 1-30, 2-82, 3-103, 4-105, 5-130, 6-140, 7-173, 8-184, 9-199, 10-211.

బౌలింగ్: క్రాంతి గౌడ్ 9-0-41-1, అమన్‌జోత్ 6-0-37-1, స్నేహ్ రాణా 10-0-32-2, దీప్తి శర్మ 10-1-54-3, శ్రీచరణి 8-0-37-2, ప్రతిక 2.4-0-6-1.

జాతీయ క్రీడా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, న్యూఢిల్లీ: క్రీడా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, శిక్షకులు, సంస్థలను గౌరవించేందుకు ఉద్దేశించిన జాతీయ క్రీడా పురస్కారాలు-2025 కోసం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఏటా ఇచ్చే ఈ అవార్డుల కోసం అర్హులైన వారు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరింది. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు అక్టోబర్ 28వ తేదీ. క్రీడారంగంలో వివిధ విభాగాల్లో విశేష సేవలందించిన వారికి మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డు, అర్జున అవార్డు, అర్జున అవార్డు (జీవితకాల సాఫల్యం), ద్రోణాచార్య అవార్డు, రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ (ఆర్‌కేపీపీ) పురస్కారాలను అందజేస్తారు. క్రీడాకారులు, కోచ్‌లు, సంస్థలు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ప్రత్యేక పోర్టల్ ద్వారా మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. అవార్డుల మార్గదర్శకాలు, ఇతర వివరాల కోసం మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్ www.dbtyas-sports.gov.in ను చూడాలని కోరింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

తిలక్ వర్మకు సీఎం అభినందన



సాక్షి, హైదరాబాద్: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో భారత జట్టు విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించిన హైదరాబాద్ యువ క్రికెటర్ తిలక్ వర్మను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా సత్కరించారు. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో తిలక్ వర్మ మర్యాదపూర్వకంగా కలిశాడు. పాకిస్తాన్‌తో ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్లో తిలక్ వర్మ అజేయ అర్ధ సెంచరీ సాధించి భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఈ సందర్భంగా తిలక్ వర్మ సీఎం రేవంత్ రెడ్డికి క్రికెట్ బ్యాట్‌ను, జెర్సీని అందజేశాడు. తిలక్ ఇచ్చిన బ్యాట్‌తో రేవంత్ రెడ్డి క్రికెట్ షాట్ కొడుతున్న ఫోజు పెట్టారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) చైర్మన్ శివసేనారెడ్డి, 'శాట్స్' ఎండీ సోనీ బాలాదేవి, సీఎం ముఖ్యకార్యదర్శి శ్రీనివాస్ రాజు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆశలు వమ్ము చేయకూడదని...

శేరిలింగంపల్లి: పాకిస్తాన్‌తో జరిగిన ఆసియా కప్ ఫైనల్లో ఎంతో ఒత్తిడి ఉన్నా... ప్రత్యర్థి ఆటగాళ్లు ఎంత రెచ్చగొట్టినా... ఎక్కడా సంయమనం కోల్పోలేదని... వారికి తన బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చానని తిలక్ వర్మ వ్యాఖ్యానించాడు. చిన్ననాటి నుంచి తాను ప్రాక్టీస్ చేసిన శేరిలింగంపల్లిలోని లేగలా క్రికెట్ అకాడమీకి మంగళవారం తిలక్ వచ్చాడు. ఈ సందర్భంగా తన కోచ్ సలామ్ బాయష్, అకాడమీ ఎండీ పృథ్వీ రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. 'కోట్లాది మంది భారతీయుల ఆశలను వమ్ము చేయకూడదనుకున్నాను. చివర్లో ఒత్తిడి వచ్చినా... దేశం కోసం ఆడాలి, గెలిపించాలన్న లక్ష్యంతో ఓపికగా ఆడాను. హెడ్ కోచ్ గౌతం గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఎంతో ప్రోత్సహించారు. నేనీ స్థాయికి చేరుకోవడం వెనుక కోచ్ సలామ్, పృథ్వీ పాత్ర ఎంతో ఉంది. ఈ ఇద్దరినీ ఎప్పటికి మర్చిపోలేను. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలి. ఈ విషయంలో కోహ్లి, రోహిత్ శర్మలు ఆదర్శం' అని తిలక్ తెలిపాడు.

సాక్షి సినిమా

జ్ఞాపకాలను మోయడం ఆపేశాను


● సమంత


''నా ఇరవయ్యేళ్ల వయసులో విశ్రాంతి లేకుండా గందరగోళంలో గడిపాను... గుర్తింపు కోసం ఆరాటపడ్డాను. నా ఫీలింగ్స్ ఏవీ పైకి కనిపించకుండా ఉండేందుకు కష్టపడ్డాను. ఈ క్రమంలో నన్ను నేను ఎంత కోల్పోయానో నాకు మాత్రమే తెలుసు. ఆ సమయంలో ప్రేమ గురించి నాకెవరూ చెప్పలేదు. కానీ నిజమైన ప్రేమ మనలోనే దాగి ఉంటుందని, మనల్ని మనం ప్రేమించుకోవడమే నిజమైన ప్రేమ అని ఆ తర్వాత అర్థం చేసుకున్నాను'' అని పేర్కొన్నారు సమంత. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన ఆలోచనలను, అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తన ఫ్యాన్స్‌తో షేర్ చేసుకుంటుంటారు సమంత. తన మేకప్‌మేన్‌తో ఓ సుదీర్ఘమైన చర్చ జరిగిందని, ఈ చర్చలో ఎన్నో అంశాలను మాట్లాడుకున్నామని పేర్కొని, వాటిలోని కొన్ని అంశాలను ప్రస్తావిస్తూ, ఇన్‌స్టాలో ఓ పోస్ట్ షేర్ చేశారు సమంత. ''ముప్ఫైఏళ్ల తర్వాత మీరు ప్రపంచాన్ని చూసే తీరు మారిపోతుంది. మీ అందంలో మార్పులొస్తాయి. ఇప్పుడు నేను ముప్ఫై ఏళ్లలో ఉన్నాను. ప్రతి దాని వెంట పరుగులు పెట్టడం ఆపేసి, జీవితాన్ని ఆస్వాదిస్తున్నాను. గతంలో నేను చేసిన తప్పుల తాలూకు జ్ఞాపకాలను మోయడం ఆపేశా. పబ్లిక్‌లో ఒకలా... ఒంటరిగా ఉన్నప్పుడు మరోలా... ఇలా రెండు రకాలుగా ఉండటం మానేశాను. ఎందుకంటే మీరు మీలా ఉన్నప్పుడే హ్యాపీగా... స్వేచ్ఛగా జీవించగలరు'' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు సమంత.

కెమెరా కాలింగ్


● మమ్ముట్టి

మలయాళ స్టార్ మమ్ముట్టి కొంత గ్యాప్ తర్వాత తిరిగి సినిమా సెట్స్‌లోకి అడుగు పెడుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో మమ్ముట్టి తీవ్ర అస్వస్థతకు గురయ్యారనే వార్తలు తెరపైకి వచ్చాయి. కానీ మమ్ముట్టి ఆరోగ్య సమస్య స్వల్పమైనదేనని, ప్రస్తుతం ఆయన పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని దర్శకుడు మహేశ్ నారాయణన్ పేర్కొన్నారు. మమ్ముట్టి, మోహన్‌లాల్ ప్రధాన పాత్రధారులుగా ఫాహద్ ఫాజిల్, కుంచాకో బోబన్ కీలక పాత్రల్లో నటిస్తున్న మలయాళ చిత్రం 'పేట్రియాట్'. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో మమ్ముట్టి అస్వస్థతకు గురయ్యారు. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ నేడు హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని తెలిసింది. ''జీవితంలో నాకు ఎంతో ఇష్టమైన పనిని (సినిమా షూటింగ్‌ని ఉద్దేశించి) తిరిగి ప్రారంభిస్తున్నాను. నా ఆబ్సెన్స్‌లో నా గురించి తెలుసుకోవాలనుకున్న అందరికీ థ్యాంక్స్ చెప్పడానికి మాటలు సరిపోవు. ది కెమెరా ఈజ్ కాలింగ్'' అంటూ 'ఎక్స్'లో పేర్కొన్నారు మమ్ముట్టి. అలాగే ఈ విషయంపై మహేశ్ నారాయణన్ మాట్లాడుతూ- ''మమ్ముట్టిగారు తిరిగి సినిమా సెట్స్‌లోకి వస్తున్నందుకు థ్రిల్లింగ్‌గా ఉంది. రాబోయే షూటింగ్ షెడ్యూల్‌లో మమ్ముట్టి, మోహన్‌లాల్ కాంబినేషన్‌లోని సన్నివేశాలను చిత్రీకరిస్తాం. ఇన్ని రోజులు మమ్ముట్టిగారు సెట్స్‌కు రాకపోవడం వల్ల నష్టం వాటిల్లకుండా ఆయన లేని సీన్స్ చిత్రీకరించాం'' అని పేర్కొన్నారు.

నవంబరులో కొదమసింహం


● చిరంజీవి

చిరంజీవి కెరీర్‌లోని సూపర్ హిట్ చిత్రాల్లో 'కొదమసింహం' ఒకటి. కె. మురళీ మోహనరావు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రాధ, సోనమ్, వాణీ విశ్వనాథ్ హీరోయిన్లుగా, మోహన్‌బాబు విలన్ పాత్ర పోషించారు. కె. నాగేశ్వర రావు నిర్మించిన ఈ చిత్రం 1990 ఆగస్టు 9న విడుదలై, ఘన విజయాన్ని సాధించింది. ముప్ఫైఐదేళ్ల తర్వాత ఈ సినిమాని నవంబరు 21న రీ రిలీజ్ చేయనున్నట్లు రమా ఫిలింస్ అధినేత కైకాల నాగేశ్వరరావు తెలిపారు. ''చిరంజీవి కౌబాయ్‌గా నటించి, ప్రేక్షకుల్ని అలరించిన చిత్రం 'కొదమసింహం'. రాజ్-కోటి సంగీతం, మోహన్‌బాబు వినోదం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రాన్ని 4కే కన్వర్షన్, 5.1 డిజిటల్ సౌండింగ్‌తో సరికొత్తగా నవంబరు 21న రీ రిలీజ్ చేయబోతున్నాం'' అని కైకాల నాగేశ్వర రావు చెప్పారు.

అసురుల గురువు శుక్రాచార్యుడు


● అక్షయ్ ఖన్నా

'హనుమాన్' మూవీ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో రూపొందుతోన్న తాజా చిత్రం 'మహాకాళి'. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో రూపొందిన తొలి చిత్రం 'హనుమాన్' (2024) పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ యూనివర్స్‌లో రూపొందుతోన్న ద్వితీయ చిత్రం 'మహాకాళి'. ప్రశాంత్ వర్మ క్రియేటర్, షో రన్నర్‌గా వ్యవహరిస్తున్న ఈ సినిమాకి పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్‌కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో అసురుల గురువు శుక్రాచార్యుడి పాత్రను బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా పోషిస్తున్నారు. ఈ క్యారెక్టర్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''ఛావా' వంటి సూపర్ హిట్ మూవీలో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించి, ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు అక్షయ్ ఖన్నా. తెలుగులో ఆయనకి 'మహాకాళి' తొలి చిత్రం. దేవతలు-దానవులు... ఇద్దరి భవితవ్యాన్ని మలిచిన శుక్రాచార్యుడిగా అద్భుతమైన పాత్ర పోషిస్తున్నారు అక్షయ్. 'మహాకాళి' షూటింగ్ 50 శాతం పూర్తయింది. డిసెంబరుకి మొత్తం పూర్తవుతుంది. ఇతర నటీనటులు, సినిమా విడుదల తేదీ వివరాలను త్వరలో ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

యాక్షన్... థ్రిల్


● విష్ణు విశాల్

విష్ణు విశాల్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'ఆర్యన్'. సెల్వ రాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రలు పోషించారు. ప్రవీణ్ .కె దర్శకత్వం వహించారు. విష్ణు విశాల్ స్టూడియోస్‌పై శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మించిన ఈ సినిమా అక్టోబరు 31న తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ని మంగళవారం రిలీజ్ చేశారు. ''ఒక యునిక్ ఇన్వెస్టిగేటివ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ఆర్యన్'. 'రాట్చసన్' వంటి విజయవంతమైన సినిమా తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీసాఫీసర్ పాత్ర పోషించారు. మా మూవీ ప్రేక్షకులను డార్క్ అండ్ ఇంటెన్స్ వరల్డ్‌లోకి తీసుకెళుతుంది. తనదైన శైలిలో విభిన్నమైన పాత్రతో విష్ణు విశాల్ ఆకట్టుకుంటారు'' అని యూనిట్ పేర్కొంది. సాయి రోనక్, తారక్ పొన్నప్ప, మాల పార్వతి ఇతర పాత్రల్లో నటించిన ఈ సినిమాకి కెమెరా: హరీష్ కన్నన్, సంగీతం: జిబ్రాన్.


● దీపికా పదుకోన్

ఏడడుగులు వేసిన చిన్నారి పెళ్లికూతురు


● మిలింద్ చాంద్వానీ, అవికా గోర్

'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్ ఫేమ్ అవికా గోర్ ఇప్పుడు నిజ జీవితంలో పెళ్లి పీటలెక్కారు. సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త మిలింద్ చాంద్వానీతో ఆమె ఏడడుగులు వేశారు. 'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్ ద్వారా గుర్తింపు సొంతం చేసుకున్న అవికా గోర్ ఆ తర్వాత హీరోయిన్‌గా మారారు. తెలుగుతో పాటు కన్నడ, హిందీలో పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లలో నటించారు. గత ఆరేళ్లుగా ప్రేమలో ఉన్న మిలింద్, అవికా గోర్ జూన్‌లో నిశ్చితార్థం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రేమికులు మంగళవారం వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

పరాక్... వింటేజ్ స్టైల్!


● శ్రీ మురళి

శ్రీ మురళి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పరాక్'. హలేష్ కోగుండి దర్శకత్వంలో బ్రాండ్ స్టూడియోస్ ఈ సినిమాను నిర్మిస్తోంది. బెంగళూరులోని బండి మహాకాళి ఆలయంలో మంగళవారం ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. ఈ వేడుకకు చన్నగిరి ఎమ్మెల్యే శివగంగ బసవ రాజు ముఖ్య అతిథిగా హాజరై, ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ మురళి మాట్లాడుతూ- ''పరాక్' ఒక వింటేజ్ స్టైల్ సినిమా'' అని అన్నారు. ఈ సినిమాకు సంగీతం: చరణ్‌రాజ్, కెమెరా: సందీప్ వల్లూరి.

వివాదాలు సృష్టించవద్దు! - ఫరా ఖాన్


● ఫరా ఖాన్

దర్శకురాలు ఫరా ఖాన్, హీరోయిన్ దీపికా పదుకోన్‌ల మధ్య అభిప్రాయభేదాలొచ్చాయని, అందుకే ఇన్‌స్టాలో వీరిద్దరూ ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకున్నారన్నది బాలీవుడ్ టాక్. దీపిక కెరీర్‌లోని రెండు బ్లాక్‌బస్టర్ చిత్రాలు 'ఓం శాంతి ఓం' (2007), 'హ్యాపీ న్యూ ఇయర్' (2014)లో షారుక్ ఖాన్ హీరోగా నటించగా, ఫరా ఖాన్ దర్శకత్వం వహించారు. ఇలా దీపిక-ఫరాల మధ్య మంచి అనుబంధం ఉంది. అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూ సందర్భంగా సినిమాల్లో హీరోయిన్స్ 8 గంటలే పని చేయాలన్నట్లుగా, 'ఎయిట్ అవర్స్ షిఫ్ట్' కాన్సెప్ట్ గురించి దీపిక మాట్లాడారు. ఈ కాన్సెప్ట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల ఓ షోలో పాల్గొన్న ఫరా ఈ 'ఎయిట్ అవర్స్ షిఫ్ట్' గురించి కాస్త వ్యంగ్యంగా మాట్లాడారు. దీంతో దీపికను ఉద్దేశించే ఫరా ఖాన్ అలా మాట్లాడారని, అందుకే వీరిద్దరూ ఒకరినొకరు ఇన్‌స్టాలో అన్‌ఫాలో అయ్యారని ప్రచారమవుతోంది. ఈ ప్రచారంపై ఫరా స్పందించారు. ''హ్యాపీ న్యూ ఇయర్' సినిమా షూటింగ్ సమయంలోనే నేను, దీపిక ఇన్‌స్టాలో కాకుండా డైరెక్ట్ మెసేజ్ లేదా ఫోన్ కాల్స్ ద్వారా మాట్లాడాలనుకున్నాం. అప్పుడే మేం ఒకరినొకరం అన్‌ఫాలో అయ్యాం. కొన్ని వెబ్ పోర్టల్స్ కొత్త వివాదాలు సృష్టిస్తున్నారు'' అంటూ తన ఇన్‌స్టా స్టోరీలో ఫరా షేర్ చేశారు. ఈ స్టోరీకి ఓ నమస్కారం ఎమోజీతో దీపిక స్పందించారు.

పల్లెటూరి నేపథ్యంలో...


● స్వప్న, రామసత్యనారాయణ

తిలక్ రాజ్, తుంగ జంటగా నటించిన చిత్రం 'తాళికట్టు శుభవేళ'. వి. జగన్నాథ రావ్ దర్శకత్వంలో బి. అరుణ్ కౌశిక్ నిర్మించిన ఈ సినిమాలో దేవరాజ్ ముఖ్యపాత్ర పోషించారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకు నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, తుమ్మలపల్లి ఆంజనేయులు గుప్త, తల్లాడ సాయికృష్ణ, స్వప్న చౌదరి హాజరై, 'తాళికట్టు శుభవేళ' వీడియో సాంగ్స్, ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం రామసత్యనారాయణ మాట్లాడుతూ- ''కొత్త తరానికి విలువలు నేర్పే మంచి కుటుంబ కథగా ఈ చిత్రం నిలిచిపోతుందని నమ్ముతున్నాను'' అని చెప్పారు. ''పల్లెటూరి నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. గ్రామీణ శైలిని ప్రతిబింబించే కథతో, వినోదం, భావోద్వేగాన్ని కలగలిపి రూపొందించాం'' అన్నారు వి. జగన్నాథ రావ్.